telugubooks

# పెద్దల మాట

చిన్న కుందేళ్ళు నాలుగింటికీ బాగా పరుగెత్తడం కూడా వచ్చింది. అందుకని ఆ రోజు "అమ్మా! మేమలా వెళ్ళివస్తాం" అని అడిగాయి తల్లి కుందేలుని.

"వెళ్ళి రండమ్మా .......కానీ అదుగో కనిపిస్తోందే ఆ ఇంటి వైపు మాత్రం వెళ్ళకండి. అక్కడ ఉన్న మనుషులు చాలా దుర్మార్గులు. ఒకసారి ఇలానే మీ నాన్న అటు వెళ్తే బంధించేశారు. ఇంతవరకూ విడిచిపెట్ట లేదు .... " అంది కన్నీరు కారుస్తూ.

"అలాగేనమ్మా అటు మాత్రం వెళ్ళం" అంటూ మాట ఇచ్చాయి నాలుగు కుందేలు పిల్లలు.

పెద్ద పిల్లలు మూడు ఆ మాట మీదే నిలబడి అటువైపు వెళ్ళ లేదు. నాల్గవది మాత్రం పంతం కొద్దీ ఆ ఇంటి వైపే వెళ్ళి నెమ్మదిగా ఇంటి ముందు తోటలోకి దూరబడింది. లోపల రకరకాల మొక్క లున్నాయి. మధ్యగా ఇల్లుంది.



మొక్కలకి ఉన్న చిన్న చిన్న కాయలని తింటూ ముందుకు బయల్దేరింది చిట్టి కుందేలు. కొద్దిదూరం వెళ్ళేసరికి ఏదో శబ్దం వినిపించసాగింది. తలెత్తి చూసింది. కొద్ది దూరంలో మొక్కలకి పాదులు చేస్తూ ఓ మనిషి కనిపించాడు. భయంతో ఒక్కసారి వెనక్కి గెంతింది చిట్టి కుందేలు.

శబ్దం రావడంతో తలెత్తి చూశాడు ఆ మనిషి. చిట్టికుందేలు అతని కంటపడింది. చటుక్కున లేచి దాని వెంటపడ్డాడు.

భయంతో చిట్టికుందేలు పరుగెత్తసాగింది. ఎంత దూరం పరుగెత్తినా ఇందాక తను లోపలికి వచ్చిన దారి తెలీక ఎటెటో పరుగెత్తసాగింది. అతను దాన్ని వెంటాడుతున్నాడు.

పరుగెత్తి పరుగెత్తి పాత సామాన్ల గదిలోకి దూకింది చిట్టి కుందేలు. దాన్ని అతను గమనించనే గమనించాడు. నెమ్మదిగా ఒక్కొక్క సామానుని కదిలించి కుందేలు కోసం చూడసాగాడు.

అతను దగ్గరకు వస్తున్న కొద్దీ చిట్టికుందేలులో భయం పెరిగిపోసాగింది. ఇంతలో అతను చిట్టి కుందేలుకి కొద్దిగా అవతల ఉన్న చెక్కనొకదిలించాడు.

అంతే! చటుక్కున ఓ ఎలుక దాని చాటునుంచి ఇవతలికి వచ్చి, పక్కనున్న కిటికీలోంచి బయటికి దూకింది.

చిట్టి కుందేలు చిన్ని బుర్రలో మెరుపు మెరిసింది. తనూ ఎలుక వెనుకే కిటికీలోంచి బయటికి దూకింది. దాని వెనుకే పరుగెత్త సాగింది.

ఎలుక భయంతో తోట దాటి బయటికి వచ్చేసింది. కుందేలు కూడా దాని వెనుకే బయటికి వచ్చింది

దూరంగా తమవేపే వస్తూ ఆ మనిషి కనిపించాడు. చిట్టి కుందేలు తమ ఇంటి వేపు వేగంగా పరిగెత్తసాగింది. ఇంటికి చేరుకున్న తరువాత కూడా ఎప్పటికోగాని గుండె దడ తగ్గలేదు.

తల్లి అటువేపు వెళ్ళవద్దని ఎందుకు చెప్పిందో దానికి అప్పుడు అర్థమైంది. ఇకముందు ఎప్పుడూ పెద్దల మాటని జవదాటకూడదని ఒట్టేసుకుంది చిట్టి కుందేలు.